సాక్షి రాజన్న సిరిసిల్ల

శనివారం | 1 | జూలై | 2023



రైతులకు పరిహారం చెల్లించాలి

సిరిసిల్లఅర్బన్: వడగళ్ల వానతో పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు.



నూతన కార్యవర్గం

సిరిసిల్లటౌన్: జిల్లా న్యాయస్థాన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా రమణారావు, ప్రధాన కార్యదర్శిగా వి.కులకర్ణి, కోశాధికా రిగా వి. శ్రీనివాస్, సభ్యులను ఎన్నుకున్నారు.

గరిష్టం/కనిష్టం
35.0/27.0

వాతావరణం

జిల్లాలో నేడు ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణం చల్లబడుతుంది. పొగమంచు కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రజకుల శాశ్వత ఉపాధికి బాటలు



అక్కరాజు శ్రీనివాస్

సిరిసిల్ల: రాష్ట్రంలోని రజకులకు శాశ్వత ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బాటలు వేస్తోందని రజక సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ సంస్థల్లో బట్టలు ఉతికే కాంట్రాక్టులను రజకులకే ఇవ్వాలని నిర్దేశిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని వివరించారు. రాష్ట్రంలోని ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ గురుకుల హాస్టల్స్, స్పోర్ట్స్ హాస్టల్స్, దేవాదాయశాఖ ఆలయాలు, ఆర్‌అండ్‌బీ అతిథి గృహాలు, పోలీస్‌హెడ్‌క్వార్టర్, ప్రాంతీయ ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రులు, బోధనాస్పత్రుల్లో రజకుల వృత్తిపై ఆధారపడిన వారికే కాంట్రాక్టులు ఇవ్వాలని జీవోలో స్పష్టం చేశారని తెలిపారు. ఇప్పటి వరకు రజక కులవృత్తితో సంబంధం లేని వ్యక్తులు కాంట్రాక్టులు పొంది.. రజకులతోనే పనిచేయించే వారని, ఈ జీవోతో ఇక నుంచి రాష్ట్రంలోని రజకులకు దీర్ఘకాలిక ఉపాధికి బాటలు పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే రజకులకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వసంస్థల్లో బట్టలు ఉతికే కాంట్రాక్టులు రజకులకు మాత్రమే ఇవ్వాలని జీవో జారీచేసిన సీఎం కేసీఆర్‌కు, కృషి చేసిన మంత్రులు కేటీఆర్, గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌కు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

4న ఇల్లంతకుంటలో ఠాణాదివస్

ఇల్లంతకుంట(మానకొండూర్): ఇల్లంతకుంట పోలీస్‌స్టేషన్‌లో జూలై 4న ఠాణాదివస్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అఖిల్‌మహాజన్ ప్రకటనలో పేర్కొన్నారు. శాంతిభద్రతల రక్షణలో పోలీస్‌శాఖ కీలకంగా వ్యవహరిస్తుందని, ప్రజాసమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. మండల ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన వాయిస్ ఫర్ గర్ల్స్



శిక్షణపత్రాలు అందజేత

గంభీరావుపేట(సిరిసిల్ల): నర్మాల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో వాయిస్ ఫర్ గర్ల్స్(సఖీ క్యాంప్) ఆధ్వర్యంలో పది రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. విద్యార్థినులకు జీవన నైపుణ్యాలు, స్పోకెన్ ఇంగ్లిష్ అంశాలలో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసిన విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందించారు. ప్రిన్సిపాల్ నిర్మల, రిపోర్టింగ్ ఆఫీసర్ వినీష, కో–ఆర్డినేటర్ మేధ, సర్పంచ్ ఎడబోయిన రాజు పాల్గొన్నారు.

రైతులు వెనక్కి తగ్గొద్దు.. మద్దతుగా నిలుస్తాం



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో పేద రైతులకు ఇచ్చిన భూములను ప్రస్తుత బీఆర్‌ఎస్ ప్రభుత్వం లాక్కునేందుకు ప్రయత్నిస్తుందని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి ఆరోపించారు. రైతులు వెనక్కి తగ్గొద్దని.. ఫారెస్ట్ అధికారులు వస్తే ప్రతిఘటించాలన్నారు. రైతులకు తాము మద్దతుగా నిలుస్తామని భరోసానిచ్చారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో శుక్రవారం పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. వెంకటాపూర్, పోతిరెడ్డిపల్లి, అగ్రహారం, హరిదాస్‌నగర్ గ్రామాలకు చెందిన బడుగు, బలహీనవర్గాల వారికి వైఎస్సార్ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందని తెలిపారు. ఆ భూములను బీఆర్‌ఎస్ ప్రభుత్వం లాక్కునేందుకు ప్రయత్నిస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, రూ.500 గ్యాస్‌సిలిండర్లను అందిస్తామని తెలిపారు. రెండు లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్, జిల్లా కార్యదర్శి లింగంగౌడ్, నాయకులు లక్ష్మారెడ్డి, బాబు, రాజునాయక్, తిరుపతిరెడ్డి, అంజిరెడ్డి, కిషన్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

వడ్లను అమ్మేశారు

గతంలో అలా..

సిరిసిల్ల పట్టణ శివారులోని ఓ పాత 'రా' రైస్ మిల్లు అది. 2021–2022 వానాకాలంలో కొనుగోలు కేంద్రాల ద్వారా వచ్చిన 680 లారీల వడ్లను సదరు రైస్‌మిల్లర్ దింపుకున్నారు. వడ్లు మంచిగ లేవని ముందే గుర్తించిన సదరు రైస్‌మిల్లర్ నేరుగా ఆ వడ్లను ప్యాలాల మిల్లులకు, ఇడ్లీ రవ్వ మిల్లులకు క్వింటాల్‌కు రూ.1,850 చొప్పున అమ్మేశాడు. కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్)గా ప్రతీ క్వింటాలు వడ్లకు 67 కిలోల బియ్యం ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంది. అప్పట్లో నేరుగా రేషన్‌బియ్యాన్ని దళారుల ద్వారా క్వింటాల్‌కు రూ.1,600 చొప్పున కొని.. అదే బియ్యాన్ని సీఎమ్మార్‌గా సరఫరా చేశాడు. అటు వడ్ల ద్వారా భారీగా డబ్బులు రాగా.. తక్కువ ధరకే రేషన్‌బియ్యం రావడంతో రైస్‌మిల్లర్లకు భారీ లాభాలు వచ్చాయి.

ఇప్పుడు ఇలా..

వేములవాడకు చెందిన ఓ రైస్‌మిల్లర్ పెద్దపల్లి జిల్లా నుంచి వ్యాన్‌లో రేషన్‌బియ్యాన్ని కొనుగోలు చేశాడు. తెల్లవారుజామున ఆ బియ్యం వ్యాన్ వేములవాడ శివారులోని సదరు రైస్‌మిల్లుకు రాగా.. విషయం తెలుసుకున్న సిరిసిల్లకు చెందిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేసి వ్యాన్‌తోపాటు, రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. రేషన్‌బియ్యం కొనడం, అమ్మడం నేరం కావడంతో ఆ బియ్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. అక్రమంగా బియ్యాన్ని కొన్న సదరు రైస్‌మిల్లును కూడా పౌరసరఫరాల అధికారులతో సీజ్ చేయించారు. ఇలాంటి ఘటనలతో రేషన్ బియ్యాన్ని ఇప్పుడు కొనే పరిస్థితి లేకుండా పోయింది.

- బియ్యం కొనడం 'కష్టమే'
- గడువులోగా సీఎమ్మార్ గగనమే
- బియ్యం లేకనే వెనులుబాటుకు సరి
- సెప్టెంబరులోగా 12.490.420 మెట్రిక్ టన్నులు అందించాలి
- పెరిగిన నిఘా.. దొరకని రేషన్ బియ్యం
- సందిగ్ధంలో రైస్‌మిల్లర్లు



రైస్‌మిల్లులో బియ్యం

సిరిసిల్ల: కొనుగోలు కేంద్రాల ద్వారా వచ్చిన ధాన్యాన్ని సీఎమ్మార్‌గా మర ఆడించి ఇవ్వడంలో రైస్‌మిల్లర్ల నిర్లక్ష్యానికి అధికారులు రూ.10కోట్ల జరిమానా విధించడం జిల్లాలో కలకలం రేపింది. జిల్లాలోని 36 రైస్‌మిల్లుల యజమానులు ఆ మొత్తం జరిమానా చెల్లించాల్సి ఉంది. 2021–2022 నాటి వానాకాలం వడ్లను కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎమ్మార్) 2023 మార్చి 31వ తేదీలోగా ఇవ్వని మిల్లుల యజమానులకు ఈ జరిమానా విధించారు. పెండింగ్‌లో ఉన్న 12,490.420 మెట్రిక్ టన్నుల సీఎమ్మార్ బియ్యం ఆధారంగా ఆయా మిల్లులకు అదనంగా 25 శాతం జరిమానా విధించారు. పోలీసుల నిఘా పెరగడంతో గతంలో మాదిరిగా బ్రోకర్ల ద్వారా రేషన్ బియ్యాన్ని కొనే పరిస్థితి లేదు. దీంతో బియ్యం ఇచ్చేదెలా.. అనే సందిగ్ధంలో మిల్లర్లు ఉన్నట్లు తెలుస్తోంది.

దిక్కులు చూస్తున్న మిల్లర్లు

భారీ మొత్తంలో అధికారులు జరిమానాలు విధించడంతో రైస్‌మిల్లర్లు బియ్యం ఇచ్చేందుకు ముందుకొచ్చారు. అయితే సెప్టెంబర్ నెలాఖరులోగా 2021–2022 వానాకాలం నాటి వంద శాతం బియ్యం అందించాలని, అదనంగా విధించిన 25 శాతం జరిమానాలు తర్వాత వసూలు చేస్తామని అధికారులు స్పష్టం చేశారు. కానీ ఇప్పుడు చాలా రైస్‌మిల్లుల్లో వడ్లు లేవు, బియ్యం లేవు. ఇటీవల మళ్లీ ప్రభుత్వం సరఫరా చేసిన వడ్లున్నా.. ఆ వడ్లకు సరిపడా సీఎమ్మార్ వచ్చే ఏడాదిలోగా ఇవ్వాలి. మొత్తంగా జిల్లాలో వడ్లను నేరుగా అమ్ముకోవడంతో సీఎమ్మార్‌కు బియ్యం లేక రైస్‌మిల్లర్లు దిక్కులు చూస్తున్నారు. తక్కువ ఏసీకేలు ఇవ్వాల్సిన మిల్లర్లు పాతయో, కొత్తవో బియ్యాన్ని సర్దుబాటు చేసే అవకాశం ఉండగా.. వందల టన్నుల బియ్యాన్ని ఇవ్వాల్సిన మిల్లర్లు మాత్రం తల పట్టుకుంటున్నారు. పోలీసుల నిఘా పెరగడంతో రేషన్ బియ్యం కొనే పరిస్థితి లేదు. ఒకవేళ కొందామన్నా రైస్‌మిల్లర్లే రేషన్ బియ్యం ధరలను పోటీపడి పెంచేశారు. దీంతో పరిస్థితి చేయిదాటిపోయిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



రైస్‌మిల్లులో వడ్ల లారీలు (ఫైల్)

నోటీసులు ఇచ్చినా స్పందన కరువు

సీఎమ్మార్ లక్ష్యం పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులు రైస్‌మిల్లర్లకు నోటీసులు ఇచ్చినా స్పందన లేదు. ఒక్క సీజన్ వడ్లను అదే సీజన్ ముగిసేలోగా మరపట్టి బియ్యం అందించాలి. కానీ జిల్లాలో రైస్‌మిల్లర్లు ఒక్క సీజన్‌లో వడ్లు తీసుకొని మరో సీజన్ ముగిసినా బియ్యం ఇవ్వడం లేదు. జిల్లాలో బాయిల్డ్, రా రైస్ మిల్లులు 87 ఉన్నాయి. బాయిల్డ్ మిల్లులకు సార్టెక్స్ మిషన్లు(శుద్ధి చేసే) ఉండగా.. రా రైస్‌మిల్లులకు సార్టెక్స్ యంత్రాలు లేక ఎఫ్‌సీఐ అధికారులు బియ్యం నాణ్యత లేదని రిజెక్ట్ చేస్తున్నారు. మొత్తం అధికారులు ఎన్ని నోటీసులు ఇచ్చినా సీఎమ్మార్ లక్ష్యం నెరవేరడం లేదు.

గడువులోగా సీఎమ్మార్ ఇవ్వాలి



జిల్లాలో 2021–2022 నాటి వానాకాలం కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను సెప్టెంబరులోగా ఇవ్వాల్సిందే. ఆ బియ్యం వందశాతం సరఫరా చేసిన తరువాత ప్రభుత్వ ఆదేశాల మేరకు జరిమానాల వసూలు ఉంటుంది. పాత లక్ష్యం పూర్తి చేసి, కొత్త వడ్ల లక్ష్యం మేరకు బియ్యం ఇవ్వాల్సి ఉంటుంది.

– జితేంద్రప్రసాద్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్

విషాదం.. విచారం..



రోదిస్తున్న రజిత బంధువులు, మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

పుట్టింట్లో ఉండలేక.. భర్త వద్దకు వెళ్లలేక..

సిరిసిల్లక్రైం/వేములవాడఅర్బన్/బోయినపల్లి(వేములవాడ): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌కి చెందిన మొహ్మద్ అలీ, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన రజిత పదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. మనసులు కలిస్తే చాలు.. మతాలు అవసరం లేదని భావించారు. వారిప్రేమకు గుర్తుగా ముగ్గురు సంతానం కలిగారు. మద్యం మహమ్మారి ఫ్యామిలీలో చిచ్చుపెట్టింది. డబ్బుల కోసం భర్త అలీ తరచూ రజితను వేధించాడు. మూడు రోజుల క్రితం పైసలు తీసుకొస్తేనే ఇంటికి రావాలని పుట్టింట్లో దించి వెళ్లాడు. తల్లిదండ్రులు కూడా తమ వద్ద డబ్బులు లేవని రజితకు చెప్పి.. భర్త వద్దకు వెళ్లాలని సూచించారు. తను ఉండగానే పిల్లలను పట్టించుకోని భర్త..తను చనిపోతే ఏం చూసుకుంటాడని భావించిందో ఏమో అటు భర్త వద్దకు వెళ్లలేక.. ఇటు పుట్టింట్లో ఉండలేక ముగ్గురు పిల్లలతో కలిసి బోయినపల్లి మండలంలోని కొదురుపాక ఫోర్‌లేన్ బ్రిడ్జి వద్ద మిడ్‌మానేరులో దూకి ప్రాణాలు తీసుకుంది. మృతులు రజిత, ఆమె కుమారులు మొహమ్మద్ అయాన్ (7), అసర జబీన్ (5) ఉస్మాన్ అహ్మద్ (14 నెలలు)గా పోలీసులు గుర్తించారు.

దైవదర్శనం కోసం వచ్చి..



సాయికుమార్(ఫైల్)



శ్రీనాథ్ (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్)/గోదావరిఖని: దైవదర్శనం కోసం వచ్చిన ఇద్దరు యువకులు కోనేరులో స్నానానికని వెళ్లి నీటమునిగి ప్రాణాలు వదిలారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం బిజిగిరిషరీఫ్ దర్గా సమీపంలో ఈ ఘటన జరిగింది. బక్రీద్ పర్వదినం సందర్భంగా గురువారం రాత్రి పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన 12 మంది యువకులు నాలుగు బైక్‌ల మీద దర్గాకు వచ్చారు. సందల్ ఉత్సవంలో పాల్గొని శుక్రవారం తెల్లవారుజామున శ్రీనాథ్ కొత్త బైక్ పూజ చేయించాలని మిగతా ఫ్రెండ్స్‌తో కలిసి గుట్టపై ఉన్న లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి వెళ్లారు. అనంతరం సమీపంలోని కోనేరులో స్నానానికని దిగారు. వీరిలో ఏడుగురు మెట్లపై ఉండి స్నానం చేసి పైకి రాగా.. సాయికుమార్(24), శ్రీనాథ్(19) కోనేరులోకి దిగారు. ఈత రాకపోవడంతో శ్రీనాథ్, సాయికుమార్ నీటమునిగి చనిపోయారు.

కమ్మేసిన నిద్రమత్తు..



దుర్గయ్య(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి తిరిగివస్తుండగా కారు నడుపుతున్న సునీల్‌ను నిద్ర ఆవహించడంతో అదుపు తప్పి పక్కనే విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు గంట దుర్గయ్య(45) మృతిచెందాడు. స్నేహితుడు మస్కూరి అశోక్ భార్యను హైదరాబాద్‌లోని పుట్టింట్లో దింపి తిరిగి వస్తుండగా శుక్రవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. కారులో ప్రయాణిస్తున్న గంట దుర్గయ్య, మస్కూరి అశోక్, రేసు శ్రీమాన్, ఊషి సునీల్ గాయపడ్డారు. దుర్గయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో సిద్దిపేటకు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. దుర్గయ్య మృతితో అతని భార్య రేణుక, కూతుళ్లు అక్షిత, ఆకాంక్ష, కుమారుడు శ్రీకర్ రోడ్డున పడ్డారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి గీతకార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. క్షతగాత్రులను పరామర్శించారు.

కూతురిని చూసి వస్తుండగా..



రోదిస్తున్న కుటుంబ సభ్యులు, మేకల నరేందర్ (ఫైల్)

వేములవాడ/వేములవాడరూరల్: వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని శాత్రాజుపల్లిలో శుక్రవారం టిప్పర్ ఢీకొని కోనరావుపేట మండలం నాగారం గ్రామానికి చెందిన వీఆర్‌ఏ మేకల నరేందర్(40) అక్కడికక్కడే మృతిచెందాడు. వేములవాడ శివారులోని గురుకుల డిగ్రీ కాలేజీలో చదువుతున్న తన కూతురును చూసి, పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల సమావేశానికి హాజరయ్యాడు. అక్కడి నుంచి బోయినపల్లి మండలం దుండ్రపల్లిలోని అత్తగారింటికి వెళ్లాడు. అక్కడి నుంచి బావబావమరుదులు చెరో బండిపై వేములవాడకు బయలుదేరారు. శాత్రాజుపల్లి దాటగానే వెనుక నుంచి వచ్చిన టిప్పర్ నరేందర్ బైక్‌ను ఢీకొట్టింది. టిప్పర్ టైర్ ఎక్కడంతో నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతిచెందాడు. కొద్ది దూరం నుంచి బావమరిది నాగరాజు ప్రమాద స్థలానికి చేరుకోగానే తన బావే అని తెలుసుకొని గుండెలవిసేలా రోదించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య వినోద, ఇద్దరు కూతుళ్లు లత, లయ ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పుస్తకాలు కొనేందుకు వెళ్లి..



కారుపాలక సతీశ్ మృతదేహం

కమాన్‌పూర్(రామగిరి):రామగిరి మండలం మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి ఇసుక లారీ ఢీకొని తండ్రి మృతిచెందగా కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని లొంకకేసారం గ్రామానికి చెందిన కారుపాకల సతీశ్(37) ఓసీపీ–2లో కాంట్రాక్టు కార్మికుడు. ద్విచక్రవాహనంపై తనకొడుకు సిద్ధూ(6)తో కలిసి సెంటినరీకాలనీకి వెళ్లాడు. పుస్తకాలు కొనుగోలు చేసి తిరిగి వస్తుండగా పెద్దపల్లి వైపు వెళ్తున్న ఇసుకలారీ ఢీకొంది. ద్విచక్ర వాహనంపై ఉన్న సతీశ్‌ను కొంతదూరం లాక్కెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందగా, సిద్ధూకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న సతీశ్ కుటుంబ సభ్యులు, ప్రతిపక్ష పార్టీల నాయకులు ఘటన స్థలానికి చేరుకొని ఆందోళన చేపట్టారు. పెద్దసంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి.సీఐలు సతీశ్, వేణుగోపాల్, ఎస్సైలు రవిప్రసాద్, వెంకటేశ్వర్లు, రాములు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. కాగా.. కుటుంబ సభ్యుల ఆందోళన కొనసాగుతోంది.

చిన్నారిని చిదిమేసిన బైక్



మృతి చెందిన జయాన్స్‌రెడ్డి

సైదాపూర్(హుస్నాబాద్): కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలానికి చెందిన ఓ చిన్నారిని బైక్ చిదిమేసింది. ఎస్సై ఆరోగ్యం తెలిపిన వివరాలు. మండలంలోని దుద్దెనపల్లికి చెందిన చాడ సంపత్‌రెడ్డి కుమారుడు జయాన్స్‌రెడ్డి(3) ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. అదే గ్రామానికి చెందిన చిన్నయాలం దేవేందర్‌రెడ్డి బైక్‌పై వస్తూ చిన్నారిని ఢీకొట్టాడు. తీవ్ర గాయాలవడంతో బాలుడిని హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి హన్మకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జయాన్స్‌రెడ్డి మృతి చెందాడు. కేసు నమోదు చేశారు.

పావుగంట ముందే గేట్లు బంద్

- నేటి గ్రూప్–4 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు
- జిల్లాలో 50 కేంద్రాల్లో పరీక్షలు
- పరీక్షలకు 14.011 మంది అభ్యర్థులు
- అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్



ఎన్.ఖీమ్యానాయక్, అదనపు కలెక్టర్

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో గ్రూప్–4 పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశామని అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ శుక్రవారం తెలిపారు. జిల్లాలో 50 కేంద్రాల్లో 14,011 మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నారని వివరించారు. అన్ని పరీక్ష కేంద్రాలను పరీక్ష సమయానికి పావుగంట ముందు గేట్లు మూసివేస్తామని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి ఉదయం 8 నుంచి 9.45 గంటల వరకు అనుమతిస్తామన్నారు. అభ్యర్థులు విధిగా పరీక్ష కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాలోని 13 రూట్లను ఏర్పాటు చేసి పోలీసు రక్షణ మధ్య పరీక్షలను నిర్వహిస్తున్నామని వివరించారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్‌ఫోన్లు, షూస్, ఆభరణాలను అనుమతించారని స్పష్టం చేశారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ, ఎల్లారెడ్డిపేట, తంగళ్లపల్లి, బోయినపల్లిల్లో 50 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఖీమ్యానాయక్ తెలిపారు. గ్రూప్–4 పరీక్షలకు 51 మంది చీఫ్ సూపరిటెండెంట్లను, 50 మంది లైజన్ ఆఫీసర్లను, 614 మంది ఇన్విజిలేటర్లను, 26 మంది రూట్ అధికారులను నియమించామని వివరించారు. ఉర్దూలో పరీక్షలు రాసేవారికి చిన్నబోనాల సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలను రాయలేని అంధ, చేతులు సక్రమంగా లేని అభ్యర్థుల కోసం 24 మంది స్క్రైబ్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి పర్యవేక్షణలో జిల్లాలో గ్రూప్–4 పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. మధ్యాహ్నం నిర్వహించే పరీక్షలకు సైతం ఒంటి గంట నుంచి 2.15 గంటల వరకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తామని, పావుగంట ముందు గేట్లు మూసి వేస్తామన్నారు.

హాస్టల్స్‌లో విద్యార్థుల సంఖ్య పెంచాలి



నేరెళ్ల గురుకుల విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో రమేశ్‌కుమార్

సిరిసిల్లటౌన్: జిల్లాలోని అన్ని సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా వెల్ఫేర్ సిబ్బంది కృషి చేయాలని డీఈవో రమేశ్ ఆదేశించారు. సిరిసిల్లలోని బీసీ విద్యార్థి వసతిగృహాన్ని, తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గురుకుల పాఠశాలలను శుక్రవారం తనిఖీ చేశారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని సూచించారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. హాస్టల్ విద్యార్థులతో మాట్లాడి వారికి కావాల్సిన వసతుల గురించి తెలుసుకున్నారు. నేరెళ్ల గురుకుల పాఠశాలలో లీడర్ల ఎన్నిక ప్రక్రియలో భాగంగా మాక్‌పోలింగ్, ఓటింగ్ ప్రక్రియను గురించి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ రాధ, హాస్టల్ వార్డెన్ శ్రీనివాస్ ఉన్నారు.

రెండు రోజులు డ్రై డే పాటించాలి

- స్వచ్ఛసర్వేక్షణ్ షెడ్యూల్ అమలు చేయండి
- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలోని అన్ని గ్రామాల్లో వారంలో రెండు రోజులు డ్రై డే పాటించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఎంపీడీవోలు, ఎంపీవోలతో స్వచ్ఛ సర్వేక్షణ్–2023 ప్రత్యేక షెడ్యూల్‌పై సమీక్షించారు. జూన్ 30వ తేదీ నుంచి జూలై 12వ తేదీ వరకు పల్లెల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రతి ఇంటిలోనూ ఇంకుడుగుంతలు ఉండాలని, ఓడీఎఫ్ ప్లస్ మార్గదర్శకాలను అమలు చేయాలన్నారు. మురికికాల్వ చివరన విధిగా ఇంకుడుగుంతలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి మంగళ, శుక్రవారం డ్రై డే నిర్వహించాలని, విద్యుత్‌లైన్‌కు దూరంగా ఉన్న వైకుంఠధామాల్లో సోలార్ పవర్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. క్రీడాప్రాంగణాలను పూర్తి చేయాలని, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ప్రతి నెలా మొదటి బుధవారం గ్రామసభలు నిర్వహించాలన్నారు. కులవృత్తిదారులకు ప్రభుత్వం ఇచ్చే రూ.లక్షను ఇప్పటి వరకు ఏ ప్రభుత్వ పథకం అందని వారికి అందేలా చూడాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, పీఆర్ ఈఈ సూర్యప్రకాశ్, డీపీవో రవీందర్, బీసీ అభివృద్ధి అధికారి రాఘవేందర్ పాల్గొన్నారు.



గణాంకాల పుస్తకం ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా అధికారులు

హాస్టళ్లను తనిఖీ చేసిన కలెక్టర్

సిరిసిల్లలోని బీసీ ప్రీ మెట్రిక్ బాలిక వసతి గృహాన్ని, గిరిజన బాలిక పోస్ట్‌మెట్రిక్ హాస్టల్‌ను కలెక్టర్ అనురాగ్ జయంతి తనిఖీ చేశారు. శానిటేషన్, తాగునీటి వసతి, వంటగదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని, వసతులు కల్పించాలన్నారు. ఈ తనిఖీల్లో రాఘవేందర్, రఫీ, ఉపేందర్‌రావు, హాస్టల్ వార్డెన్ శ్యామల ఉన్నారు.

గణాంకాల బుక్ ఆవిష్కరణ

జాతీయ గణాంక దినోత్సవాన్ని పురస్కరించుకొని గణాంకాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. దేశ సగటు ఆదాయం కంటే రాష్ట్ర సగటు ఆదాయం మెరుగ్గా ఉందన్నారు. తలసరి ఆదాయంలోనూ తెలంగాణ ముందుందని పేర్కొన్నారు. సీపీవో పీబీ శ్రీనివాసాచారి, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి కలెక్టరేట్‌లో బయోమెట్రిక్

కలెక్టరేట్‌లోని అధికారులు, ఉద్యోగులకు బయోమెట్రిక్ అటెండెన్స్ అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. శనివారం నుంచి బయోమెట్రిక్ అమలులోకి వస్తుందన్నారు. ఇప్పటి వరకు బయోమెట్రిక్ హాజరు కోసం వివరాలు ఇవ్వని ఉద్యోగులు వెంటనే ఐడీవోసీలోని ఐటీ విభాగంలో నమోదు చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

రాజన్న ప్రసాదం అందజేత



పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

వేములవాడ : మాజీ ఎంపీ, వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ శుక్రవారం కలిశారు. రాజన్న ప్రసాదాన్ని అందించి కండువా కప్పి సత్కరించారు. అలాగే సీఎల్పీ నేత భట్టి విక్రమార్కను కలిసి రాజన్న ప్రసాదం అందజేశారు.

3న గురుపూర్ణిమ

వేములవాడ: పట్టణంలోని మార్కండేయ నగర్‌లోని షిరిడీ సాయిబాబా ఆలయంలో ఈనెల 3న గురుపూర్ణిమ వేడుకలను నిర్వహిస్తున్నట్లు సాయిబాబా సేవా సంస్థాన్ ప్రతినిధులు వారాల దేవయ్య, రమేశ్, రవీందర్‌రావు శుక్రవారం తెలిపారు. ఉదయం 5.30 గంటలకు క్షీరాభిషేకం, పుష్పార్చన, 10 గంటలకు భక్తి సంగీత విభావరి, అన్నప్రసాద వితరణ, మధ్యాహ్న హారతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రగతి భవనాలను త్వరగా పూర్తిచేయాలి



శంకుస్థాపన చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: గ్రామాల్లో ప్రగతి భవనాల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేయాలని ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు పేర్కొన్నారు. మండలంలోని రాగట్లపల్లిలో రూ.20 లక్షలతో నిర్మించనున్న ప్రగతి భవనం నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రగతి భవనం లేని గ్రామాల్లో మంత్రి కేటీఆర్ సహకారంతో నిధులు మంజూరు చేయించి పనులు చేపడతామన్నారు. సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, సర్పంచ్ దాసరి సుజాత, నాయకులు సుభాష్, నర్సింహారెడ్డి, నర్సింలు, బాల్‌రెడ్డి, రాము యాదవ్, పాల్గొన్నారు.

వైద్యులు.. దైవదూతలు

- ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్న అనేక వైరస్‌లపై పోరాటం
- రోగుల ప్రాణాలు కాపాడుతున్న వైనం
- నేడు జాతీయ వైద్యుల దినోత్సవం



కోవిడ్-19 గర్భిణికి పురుడు పోసిన వైద్య బృందం (ఫైల్)



తల్లిదండ్రులతోపాటు డాక్టర్ సాయినాథ్‌రెడ్డికి బియ్యం ఇస్తున్న రాయమల్లు (ఫైల్)

కోల్‌సిటీ(రామగుండం): 'ఏం పర్లేదు.. భయపడాల్సిందేమీ లేదు.. తగ్గిపోతుందంటూ.. రోగుల్లో ఆశను రేకెత్తించే వ్యక్తే డాక్టర్. తల్లిదండ్రులు జన్మనిస్తే, వైద్యులు పునర్జన్మనిస్తున్నారు. దైవం మానవ అవతారమే వైద్యుడు. చదువులకు సరస్వతి, ధనానికి లక్ష్మీ దేవతలను పూజించినట్లు... ప్రాణం కోసం మహావిష్ణువు ధన్వంతరి అవతారాన్ని ఎత్తాడని పెద్దలు చెబుతుంటారు. 'వైద్యోనారాయణో హరి'కి నిలువెత్తు నిదర్శనంగా కొందరు డాక్టర్లు సేవాభావంతో రోగులకు ప్రాణం పోస్తున్నారు. ప్రతీ కేసును సవాల్‌గా తీసుకుంటున్నారు. ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్న అనేక వైరస్‌లపై పోరాటం చేస్తూ, తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల ప్రాణాలు కాపాడుతున్నా రు. ఏటా జూలై 1వ తేదీని మన దేశంలో 'జాతీయ వైద్యుల దినోత్సవం'గా జరుపుకుంటున్నాం.

డాక్టర్స్ డే నేపథ్యం ఇదీ..

భారతీయ వైద్య రంగంలో వ్యక్తిత్వంతోపాటు అన్ని తరాలకు ఆదర్శంగా నిలిచిన డాక్టర్ బీసీ రాయ్ జయంతిని ఏటా జూలై 1న నిర్వహిస్తున్నారు. ఇదే రోజున డాక్టర్స్ డే కూడా జరుపుతున్నారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, విద్యావేత్తగా, సంఘ సంస్కర్తగా.. నిరుపేదలకు ఆపన్న నేస్తంగా వైద్య సేవలందించిన వైద్యుడిగా రాయ్ సుపరిచితులు. 1882లో జూలై 1న జన్మించిన ఆయన కోల్‌కతా, ఇంగ్లండ్‌లలో ఉన్నత విద్యాభ్యాసం చేశారు. వైద్యుడిగా సేవలందిస్తూనే రాజకీయ రంగంలో అరంగేట్రం చేసి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా 12 ఏళ్లపాటు పని చేశారు. ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలోనూ ఆయన రోగులకు నిత్యం ఓ గంటపాటు సేవలందించేవారు. 1991లో ప్రభుత్వం రాయ్‌కి భారతరత్న అవార్డు ప్రదానం చేసింది. 1962 జూలై 2న ఆయన మృతిచెందారు.

ఇళ్లలో డాక్టర్ సాయినాథ్‌రెడ్డి ఫొటోలు..

సృష్టికి ప్రతిసృష్టిగా నిలిచిన వైద్యులు రోగుల బాధలను తమ స్టెతస్కోప్‌తో గుర్తిస్తున్నారు. ధరణిపై దేవతలుగా డాక్టర్లను కొలుస్తున్న కొందరు రోగులు.. వారి ఫొటోలను ఇళ్లలో పెట్టుకొని, పూ జలు చేస్తున్నారు. గోదావరిఖనిలో దివంగత డాక్టర్ సాయినాథ్‌రెడ్డి ప్రజల బాధలను మాత్రలతో కాకుండా, మనసుతో తెలుసుకొని, వారికి దగ్గరయ్యారు. అందుకే ఇప్పటికీ ఆయన ఫొటోను పలువురు ఇళ్లలో పెట్టుకున్నారు. మరణించిన తల్లిదండ్రులతోపాటు ప్రాణం పోసిన డాక్టర్‌సాయినాథ్‌రెడ్డికి సింగరేణి మాజీ కార్మికుడు కడమండ రాయమల్లు ఏటా పెతర అమావాస్య రోజు బియ్యం ఇస్తూ అభిమానాన్ని చాటుకుంటున్నాడు.

పాడె కట్టి ఊరేగింపు



ఎల్లారెడ్డిపేటలో భారీ ర్యాలీ తీస్తున్న ముదిరాజ్‌లు

- పాడి కౌశిక్‌రెడ్డి అనుచిత వాఖ్యలను నిరసిస్తూ ధర్నా
- ఎల్లారెడ్డిపేటలో ముదిరాజ్‌ల భారీ ర్యాలీ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ముదిరాజులపై అనుచిత వాఖ్యలకు నిరసనగా ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డికి పాడె కట్టి దిష్టిబొమ్మతో భారీ ఊరేగింపు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి ముదిరాజ్లు పెద్ద ఎత్తున తరలివచ్చి సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై బైటాయించి రాస్తారోకో - ధర్నా చేశారు. మండల కేంద్రంలో కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను ఊరేగించారు. చిత్ర పటానికి చెప్పుల దండలు వేసి ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పాత బస్టాండ్‌లో దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముదిరాజ్‌లపై అనుచిత వాఖ్యలు చేసిన పాడి కౌశిక్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ, ఎమ్మెల్సీ పదవినుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ముదిరాజు ప్రతినిధులు కనమేణి సాయిలు, దేవేందర్, గడ్డమీది రాజయ్య, సురేశ్, సత్తయ్య, ప్రవీణ్, దేవరాజు, తిరుపతి, అనిల్, గోపాల్, హరీశ్, అజయ్, అశోక్, రాజు, మహిళలు పాల్గొన్నారు.

సాయిచంద్ మృతి తీరని లోటు



అమరవీరుల స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న కొండూరు రవీందర్‌రావు, నాయకులు

- టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు

గంభీరావుపేట (సిరిసిల్ల): రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ మృతి తీరని లోటని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు పేర్కొన్నారు. మండలకేంద్రంలోని తెలంగాణ అమర వీరుల స్థూపం వద్ద శుక్రవారం ఘన నివాళి అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఉద్యమ సమయంలో తన గొంతుతో ప్రజలను జాగృతపరిచిన సాయిచంద్ మృతిని జీర్ణించుకోలేకపోతున్నామన్నారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ నారాయణరావు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు అహ్మద్, బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు వెంకటస్వామి గౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ దయాకర్‌రావు, నాయకులు సురేందర్ రెడ్డి, కొమిరిశెట్టి లక్ష్మణ్, రాజారాం, పిట్ల శ్రీమతి, ఎగదండి స్వామి, హన్మంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు 'డబుల్' ఇళ్లు అందించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్



మాట్లాడుతున్న మూశం రమేశ్

సిరిసిల్లటౌన్: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ సొంతిల్లు అందజేయాలని ఇందుకోసం గృహలక్ష్మి పథకంపై స్పష్టత ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిరిసిల్ల బీవైనగర్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డబుల్ బెడ్ రూం ఇళ్లలో జాప్యం వద్దని, రానివారికి నివేశన స్థలాలు ఇచ్చి అందులో ఇల్లు కట్టుకునేందుకు గృహలక్ష్మి పథకం కింద ఆర్థిక సాయం అందివ్వాలన్నారు. ఇందిరమ్మ కాలనీల్లో ఖాళీగా ఉన్న ప్లాట్లకు గృహలక్ష్మి పథకం కింద ఇళ్లు నిర్మించాలన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ. ఈనెల 3న కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు తెలిపారు. నాయకులు ఎగమంటి ఎల్లారెడ్డి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సూరం పద్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాముల రమేశ్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

- ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాములు



మాట్లాడుతున్న కడారి రాములు

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు గ్రామ పంచాయితీ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసి జిల్లా కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం సిరిసిల్లలోని కార్మిక భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కారోబార్లు, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలన్నారు. కార్మికుల వేతనాలు పెంచి, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. పారిశుధ్యం, స్వీపర్, పంప్ ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్స్, డ్రైవర్లు, కారోబార్లు, బిల్ కలెక్టర్లు, నర్సరీలు, పార్కుల నిర్వహణలో పనిచేసే సిబ్బంది అందరికీ పీఆర్సీ ప్రకారం రూ.19వేలు చెల్లించాలని, జీపీ కార్మికులకు రూ.15,600, కారోబార్లు, బిల్ కలెక్టర్లకు రూ. 19,500 చెల్లించాలన్నారు. సమావేశంలో నాయకులు అజ్జవేణు, మంచికట్ల రమేశ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జూలైలో సదరం క్యాంపులు

సిరిసిల్లటౌన్: జూలైలో సదరం క్యాంపుల నిర్వహిస్తున్నట్లు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ మురళీధర్‌రావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 6న మానసిక దివ్యాంగులు, రెన్యూవల్స్, 11న వినికిడి రెన్యూవల్స్, 20న ఆర్థో రెన్యూవల్స్‌కు ప్రత్యేక శిబిరాలను జిల్లా ఆస్పత్రిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్యులు నిర్ధారించిన తేదీల ప్రకారం మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ చేసుకున్న వారు మాత్రమే శిబిరానికి హాజరుకావాలని సూచించారు. మీసేవ స్లాట్, ఆధార్‌కార్డు, మీసేవలో ఇచ్చిన పాస్‌పోర్టు సైజ్ ఫొటో, మెడికల్ డాక్యుమెంట్లు, ఎక్స్–రే, ఫోన్‌నంబరుతో రావాలని సూచించారు.

పరీక్ష అభ్యర్థులకు.. పాట్లు విద్యార్థులకు



బెంచీలు తీసుకెళ్తున్న విద్యార్థినులు

సిరిసిల్లటౌన్: గ్రూప్–4 పరీక్ష గురుకుల విద్యార్థులకు పాట్లు తెచ్చిపెట్టింది. శనివారం గ్రూప్ 4 పరీక్ష జరగనుండగా సిరిసిల్ల పరిధిలోని బోనాల సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో బెంచీలు మోయించడం శుక్రవారం పలు విమర్శలకు తావిస్తోంది. విద్యార్థినులతో బెంచీలు మోయించగా సిబ్బంది నంబర్లు వేశారు. ఉపాధ్యాయులు ఆదేశించడంతో విద్యార్థినులు మోయలేని బరువులతో పాట్లు పడ్డారు. కాగా ఈ ఫొటోలు శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా సిబ్బంది తక్కువగా ఉన్నారని, విచారణ జరుపుతామన్నారు.

ఐదు తరగతులకు ఒకే టీచర్



పాఠాలు బోధిస్తున్న టీచర్

- ఇదీ హరిజనవాడ ప్రాథమిక పాఠశాల దుస్థితి
- మొత్తం 53 మంది విద్యార్థులు
- ప్రభుత్వ ఉపాధ్యాయుల పిల్లలు ప్రైవేట్ బడికి
- నాణ్యమైన విద్యకు దూరం

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): ఆ పాఠశాలలో 53 మంది విద్యార్థులు.. ఐదు తరగతులకు ఒకే టీచర్ పాఠాలు బోధించడంతో విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారు. మండలకేంద్రంలోని హరిజనవాడలోని ప్రాథమిక పాఠశాలలో 53 మంది విద్యార్థులు ఉన్నారు. ఐదు తరగతులకు శుక్రవారం 30 మంది విద్యార్థులు హాజరయ్యారని, ఒకే వరండాలో కూర్చుండబెట్టి పాఠాలు బోధిస్తున్నామని ప్రిన్సిపల్ కరుణ తెలిపారు. పాఠశాలలో ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులున్నా మరో ఉపాధ్యాయుడు తిరుపతి జూలై 1న జరిగే గ్రూప్ 4 పరీక్షకు సంబంధించిన శిక్షణ ఉండడంతో ఎమ్మార్సీకి వెళ్లినట్లు తెలిపారు. ప్రభుత్వం మన ఊరు– మన బడి కింద కార్పొరేట్ విద్యావ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని ప్రచారం చేస్తున్నా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. మరోపక్క ప్రభుత్వ ఉపాధ్యాయుల పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చేర్పించి, గ్రామాల్లో చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ప్రచారం నిర్వహించడంతో ప్రభుత్వ విద్యపై నమ్మకం కలగడం లేదు. ఒకే టీచర్ ఐదు తరగతులకు ఎలా బోధిస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల పెద్దబడి ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి కేటీఆర్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికపై దృష్టి సారించాలని సూచించారు. ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధుల పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించి ప్రజ ల్లో నమ్మకం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లకల్చరల్: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ పరిధిలో నిర్వహించనున్న వివిధ క్రీడా పాఠశాలల్లో 4,5వ తరగతుల్లో ప్రవేశాల కోసం ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీవైఎస్‌వో అజ్మీరా రాందాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలస్థాయిలో నేటినుంచి 5వ తేదీ వరకు ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులు సంబంధిత మండల విద్యాధికారులను సంప్రదించాలని ఆయన కోరారు. జిల్లా స్థాయిలో జరిగే ఎంపిక పరీక్షలకు హాజరయ్యేవారు గతేడాది చదివిన ప్రోగ్రెస్ రిపోర్ట్, కుల ధ్రువీకరణ పత్రం, 10 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఈనెల 12న మినీ స్టేడియంలో హాజరు కావాలన్నారు.

వడ్డీ వ్యాపారులపై టాస్క్‌ఫోర్స్ దాడులు

- జిల్లాలో కలకలం



వేములవాడలో తనిఖీలు చేస్తున్న సీఐ వెంకటేశ్ ఆధ్వర్యంలో పోలీసుల బృందం

సిరిసిల్లక్రైం: జిల్లాలో అధిక వడ్డీకి వ్యాపారం చేస్తున్న వారి ఇళ్లు, వస్త్రవ్యాపారుల నివాసాలపై జిల్లా పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం ఏకకాలంలో దాడులు నిర్వహించారు. వ్యాపారం అధికంగా జరిగే జిల్లా కేంద్రం సిరిసిల్లతోపాటు ధార్మిక కేంద్రం వేములవాడలోనూ ఈ దాడులు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 16 మంది వడ్డీ వ్యాపారుల ఇళ్లు, చిట్‌ఫండ్స్‌లలో తనిఖీలు జరిగినట్లు సమాచారం. సిరిసిల్లకు చెందిన 8 మంది వస్త్రవ్యాపారుల వివరాలు సేకరించినట్లు తెలిసింది. ఈ తనిఖీలకు సంబంధించిన పూర్తి వివరాలు ఎస్పీ అఖిల్‌మహాజన్ శనివారం వెల్లడించనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

భయాందోళనలో వ్యాపారులు

ఇన్నాళ్లు ఇష్టారీతిగా వ్యాపారాలు చేసిన వారు తీరు మార్చుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పలుమార్లు హెచ్చరించారు. ఓ వైపు బందోబస్తు విధుల కేటాయింపుల్లో పోలీసులు బిజీగా ఉన్నారనే సమయంలో అందరి దృష్టి మరల్చి టాస్క్‌ఫోర్స్ పేరిట దాడులు చేయడంతో వ్యాపారులు ఉలిక్కిపడ్డారు. ఈ దాడులు శుక్రవారం అర్ధరాత్రి కొనసాగాయి.

వేములవాడలో..

వేములవాడ: వేములవాడలోని ఏడుగురు వడ్డీ వ్యాపారుల ఇళ్లపై స్థానిక పోలీసులు శుక్రవారం ఏకకాలంలో దాడులు చేశారు. ఎస్పీ అఖిల్ మహాజన్ చేపట్టిన ఠాణా దివస్‌లో వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు 12 బృందాలుగా విడిపోయి తనిఖీలు నిర్వహించారు. ఓ ఫైనాన్స్ కంపెనీ నిర్వాహకులు తాళాలు వేసి వెళ్లగా.. తాళాలు తీసి రికార్డులు తనిఖీ చేశారు. సీఐ వెంకటేశ్ మాట్లాడుతూ అధిక వడ్డీ వసూలు చేసే వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. రికార్డులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పోలీసుల అదుపులో పలువురు వడ్డీ వ్యాపారులు, నగదు ఉన్నట్లు తెలిసింది. టాస్క్‌ఫోర్స్ దాడులతో వేములవాడలోని వడ్డీ వ్యాపారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. కొందరు ఇళ్లకు తాళాలు వేసి పరారైనట్లు ప్రచారంలో ఉంది.

టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్, సేవాలాల్‌తండా, పోతుగల్ గ్రామాల్లో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ముస్తాబాద్‌లో నల్ల బెల్లం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు పలు కిరాణ దుకాణాలలో ఎస్సై శైలజ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఇంటి అవసరాల కోసం వినియోగదారులకు విక్రయిస్తున్నానమని.. స్మగ్లర్లకు అమ్మడం లేదని స్పష్టం చేశారు.